క్లుప్తంగా

ఉశేని వలి తాత ఉరుసు



కారుమంచిలో ఉశేన్ వలి తాత దర్గా

ఆస్పరి: మండలంలోని కారుమంచి గ్రామంలో ఆదివారం నుంచి నేముటూరు ఉశేన్ వలి తాత ఉరుసు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామి వారికి భక్తులు గంధం సమర్పించి దర్శించుకున్నారు. సోమవారం ఉరుసు, మంగళవారం జియారత్ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని సర్పంచ్ లక్ష్మి, గ్రామ పెద్దలు తెలిపారు.

15 నుంచి డీ.కోటకొండలో..

ఈనెల 16వ తేదీన మండలంలోని డీకోటకొండ గ్రామంలో దస్తగిరి స్వామి ఉరుసు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈనెల 15న గంధం, 16న ఉరుసు, 17న జియారత్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఆధ్యాత్మికత అలవర్చుకోవాలి



ఉపన్యసిస్తున్న శంకర నందస్వామి

నందవరం: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని ఆరూఢజ్యోతి శాంతాశ్రమ మఠం పీఠాధిపతి సద్గురు శ్రీ నిజానంద మహాస్వామి, ఉరుకొండ మఠం పీఠాధిపతి శ్రీ కరిబసవ రాజేంద్ర స్వామి, శ్రీ సిద్ధారూఢ ఆశ్రమం మాతా శ్రీ జ్ఞానేశ్వరిదేవి, శివరామ ఆశ్రమం మఠం పీఠాధిపతి అభినవ శ్రీ శంకర నందస్వాములు సూచించారు. ఆదివారం నందవరంలో సత్సంగ సువిచార సమితి ఆధ్వర్యంలో శ్రీ నిజానంద స్వాముల 331వ తులా భార సేవలో భాగంగా భక్తులకు ఉపన్యాస కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా గ్రామంలోని శరణ బసవేశ్వర స్వామి మఠంలో స్వామికి వేకువజామున ఫల, పుష్పాలు సమర్పించి విశేష పూజలు గావించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు భక్తులకు ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులు, భక్తాదులు పాల్గొన్నారు.

బండేగురువుల ఆరాధానకు వేళాయె



బండేగురుడి స్వామి మూలవిరాట్

నందవరం: భక్తులను అనుగ్రహించే గురువులుగా వర్ధిల్లుతూ పూల చింత గ్రామంలో వెలసిన సద్గురు బండేగురుడి 117వ జాతర ఉత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మఠం పెద్దలు జయ శంకరప్ప స్వామి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఉప పీఠాధిపతి బండే గురు స్వామి తెలిపారు. 15న బుధవారం ఉదయం 6 గంటల నుంచి 8:30 వరకు శ్రీ వరబండేగురు లింగం (కాశీ లింగం)కు ప్రత్యేక పూజలు చేపడతారు. సుప్రభాత సేవ, రుద్రాభిషేకం వంటి విశిష్ట పూజలు నిర్వహిస్తారు. 10 గంటలకు భక్తులకు అన్నదాన కార్యక్రమం, మధ్యాహ్నం 2 గంటల నుంచి స్వామి వారికి పల్లకీ, నందికోల సేవ నిర్వహిస్తారు. సాయంత్రం 4:30 గంటలకు కుంభోత్సవం నిర్వహించి బండేగురు స్వామి రథోత్సవం చేపడతారు. అలాగే ప్రభోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం రాత్రి అఖండ భజన కార్యక్రమం ఉంటుంది. భక్తాదులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఉత్సవాలు విజయవంతం చేయాలని ఉప పీఠాధిపతి కోరారు.

టమాటాకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఎమ్మిగనూరు: టమాటాకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, రైతు సంఘం నాయకులు సత్యన్న కోరారు. ఈ మేరకు ఆదివారం ఏపీ రైతు సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మార్కెట్‌లో టమాటాకు ధర లేకపోవడంతో రోడ్లపై పారబోసి ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ పత్తికొండలో జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు పాలకులు కృషి చేయాలన్నారు. నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం అందజేయాలని కోరారు. సీపీఐ నాయకులు పంపన్నగౌడ్, రంగన్న, మల్లికార్జున, రైతు సంఘం నాయకులు జబ్బార్, మలికార్జునగౌడ్, మాలిక్ పాల్గొన్నారు.

అత్యాచారయత్నం కేసు నమోదు

కృష్ణగిరి: మండల పరిధిలోని ఎస్‌హెచ్ ఎర్రగుడి గ్రామానికి చెందిన జయరాముడుపై ఆదివారం అత్యాచారయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన ఓ వివాహితపై రాత్రి వేళ ఇంట్లో ఎవరూ లేని సమయంలో అసభ్యంగా ప్రవర్తించినట్లు బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు.

పొలం గట్టు విషయంలో ఘర్షణ

కృష్ణగిరి: మండలంలోని లాల్‌మాన్‌పల్లె గ్రామంలో పొలం గట్టు విషయంలో అన్నదమ్ముల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరిపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన షేక్ కాశీం, బుడేన్ బాషా అన్నదమ్ములు. పొలం గట్టు వద్ద ఉన్న హద్దు రాయిని ఎందుకు జరిపావని కాశీం బుడేన్ బాషాను ప్రశ్నించగా గొడవ పెట్టుకుని అతనిపై దాడిచేశాడు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు బుడేన్‌బాషాపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.



డ్రాగన్ ఊయలలో ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



నెట్ జంపింగ్‌లో చిన్నారుల కేరింతలు



మిఠాయిలు కొనుగోలు చేస్తున్న జనం

జాతర వచ్చె.. సంబరం తెచ్చే

బ్రహ్మంగారి జాతర ఊరంతా సంబరాన్ని తెచ్చింది. తిరునాల సందర్భంగా ఆదివారం ఏర్పాటుచేసిన దుకాణాల వద్ద సందడి కనిపించింది. ఊయల్లో ఉల్లాసంగా ఊగుతూ, జంపింగ్ నెట్‌లలో చిన్నారులు కేరింతలు కొడుతూ ఆనందపరవశులయ్యారు. బొమ్మల దుకాణాలు కొనుగోళ్లతో కిటకిటలాడాయి . తెలుగు సంప్రదాయం ప్రతిబింబించేలా గాజుల అంగళ్ల వద్ద ఆడపడచుల సందడి కనిపించింది. స్వీట్స్ దుకాణాల్లోని తినుబండారాలను ప్రజలు కొనుగోలు చేశారు. తేరుబజారు ప్రాంతమంతా బంధుమిత్రుల కోలాహలంతో నిండిపోయింది.

– పత్తికొండ రూరల్





తిరునాలలో ప్రజల కోలాహలం, (ఇన్‌సెట్) గురి చూసి గన్ షాట్

బ్రహ్మగుండేశ్వర క్షేత్ర చరిత్ర పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న ఆలయ చైర్మన్, అతిథులు

వెల్దుర్తి: పట్టణ సమీపంలోని మహిమాన్విత శైవ క్షేత్రం బ్రహ్మగుండంపై ప్రముఖ రచయిత్రి, కేవీఆర్ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి రచించిన 'కామేశ్వరీదేవి సహిత బ్రహ్మగుండేశ్వర క్షేత్ర చరిత్ర' పుస్తకావిష్కరణ ఆదివారం అట్టహాసంగా జరిగింది. క్షేత్రంలోని ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో సాహితీ సదస్సు, తెలుగు భాషా వికాస ఉద్యమం సారథ్యంలో సరసం మహిళా వేదిక పక్షాన ఆలయ చైర్మన్ బొమ్మన పెద్దిరెడ్డి, గాడిచెర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర కల్కూర పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభాధ్యక్షురాలు సుబ్బలక్ష్మి, సాహితీ సదస్సు కార్యదర్శి జేఎస్ఆర్‌కే శర్మ పుస్తక రచనా శైలి, పుస్తకంలోని పలు ప్రతులను చదివి వినిపిస్తూ రచయిత్రిని అభినందించారు. ఆలయ ఈఓ హనుమంత రావ్, ధర్మకర్తల మండలి చైర్మన్లు మాట్లాడుతూ బ్రహ్మగుండం క్షేత్ర మహిమ నలుదిశలా వ్యాపించేందుకు కృషి చేస్తున్న రచయిత్రికి కృతజ్ఞతలు తెలిపారు. రచయిత్రి మాట్లాడుతూ బ్రహ్మగుండేశ్వరుని చరిత్ర రాయడం తన పూర్వజన్మ సుకృతమని, క్షేత్ర విశేషాలను భావితరాలకు తెలియజెప్పడం బాధ్యతగా రచన చేసినట్లు తెలిపారు. ఇందుకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, ఉప్పరి సంఘం ప్రతినిధులు, ఆలయ సిబ్బంది, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆయకట్టుదారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన బాంఢాగారాలు

హొళగుంద: గ్రంథాలయాలు విజ్ఞాన బాంఢాగారాలు అని వైఎస్సార్‌సీపీ నాయకులు రాఘవేంద్ర, నాగప్ప అన్నారు. ఆదివారం కోగిలతోట గ్రామంలో గ్రంథాలయ శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జిల్లా గ్రంథాలయ చైర్మన్ సహకారంతో గ్రంథాలయ శాఖను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రంథాలయంలోని నవలలు, పత్రికలతో పాటు పుస్తకాలు చదవడం వల్ల విలువైన విషయాలను తెలుసుకోవచ్చన్నారు. హొళగుంద లైబ్రేరియన్ వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డార్విన్ సిద్ధాంతాలతో సైన్స్ కొత్తపుంతలు



ప్రశంసా పత్రాలు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరు: జీవ పరిణామాలను మానవజాతికి పరిచయం చేసి, విజ్ఞాన శాస్త్రానికి కొత్త పుంతలు నేర్పిన మహానుభావుడు చార్లెస్ డార్విన్ అని వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక వీవర్స్ కాలనీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చార్లెస్ డార్విన్ జయంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు మాదన్న, సంజీవ్‌రావు మాట్లాడుతూ.. సైన్సు మానవ జీవితంలో ప్రతి కోణాన్ని ఆవిష్కరిస్తోందని, సైన్స్ లేని మానవ జీవితాలను ఊహించుకోలేమన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నాగమణి, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు శంకరయ్య మాట్లాడారు. అనంతరం 'చార్లెస్ డార్విన్-జీవ పరిణామం' అంశంపై సెమినార్ నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన చెకుముఖి టాలెంట్ టెస్టులో ప్రతిభ చూపిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. యూటీఎఫ్ నాయకులు బాబు, యల్లప్ప, రాఘవేంద్ర, రామాంజినేయులు, జనవిజ్ఞాన వేదిక నాయకులు ఖాదర్, ప్రసాద్ పాల్గొన్నారు.

శరవేగంగా భూముల రీసర్వే

- ఎన్నో ఏళ్ల నాటి భూ సమస్యలకు పరిష్కారం చూపుతున్న ప్రభుత్వం
- భూముల హద్దులు గుర్తించి కంచెల ఏర్పాటుకు చర్యలు



నగరదోణలో సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ లక్ష్మీనారాయణ

చిప్పగిరి: భూముల వివాదాలు అన్నీ ఇన్నీ కావు, ఆ విషయాలు చెప్పుకుంటూ పోతే స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి, అంతకు ముందు నుంచి రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు వర్ణణాతీతం. అయినా ఆ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. గత ప్రభుత్వాలు భూ సమస్యలను విస్మరించాయి. ప్రస్తుతం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏళ్ల తరబడి నెలకొన్న భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు చేపట్టారు. అందులో భాగంగా భూముల సమగ్ర రీసర్వే చేపట్టింది. రీసర్వేలో భాగంగా మొదట ఫీల్డ్ సర్వే చేపట్టారు. ప్రభుత్వం చేపట్టిన రీసర్వే వల్ల రైతాంగానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. వాటిలో మిగులు భూములు, అనుభవదారులను గుర్తించి నిబంధనల మేరకు వారికి కేటాయించడం, వారసత్వ భూములు ఆన్‌లైన్ చేయడం, పేర్ల పొరపాట్లు సరిదిద్దడం, 22ఏ1లో తప్పు ఒప్పులు సరిదిద్దడం, అగ్రిమెంట్ మీద అనుభవంలో ఉన్న భూములకు పరిష్కారం, తదితర సమస్యలకు ప్రభుత్వ నిబంధనల మేరకు రెవన్యూ అధికారులు శాశ్వత పరిష్కారం చూపనున్నారు.

50,000 ఎకరాల్లో సర్వే పూర్తి చేశాం



సమగ్ర భూసర్వేలో భాగంగా ఇప్పటివరకు 50,000 ఎకరాల్లో ఫీల్డ్ సర్వే పూర్తి చేశాం. మండలంలోని తిమ్మాపురం, కుందనగుర్తి, కాజీపురం, డేగులహాలు, గ్రామాల్లో ఫీల్డ్ సర్వే పూర్తయ్యింది. త్వరలోనే మండల పరిధిలోని మొత్తం 74,000 ఎకరాల్లో సర్వే పూర్తి చేస్తాం. కోర్టులలో కేసులు ఉన్న భూములు తప్పించి మిగతా భూ సమస్యలకు ప్రభుత్వ నిబంధనల మేరకు భూ యజమానులు సంతృప్తి చెందేలా పరిష్కరిస్తాం.

– డీటీ గుండాలనాయక్

చౌడేశ్వరి అమ్మవారికి పూజలు



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీ అమ్మవారు

మద్దికెర: స్థానిక కొండమ్మ బావి వీధిలో వెలసిన చౌడేశ్వరీ అమ్మవారికి జ్యోతుల మహోత్సవాలు నిర్వహించి నెల రోజులు ముగిసిన సందర్భంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పల్లా ఆంజనేయులు ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన, మహామంగళహారతి పూజలు నిర్వహించారు. భక్తులు ఆలపించిన గీతాలు ఆధ్యాత్మికత నింపాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు పెద్దకోట్ల రమేష్, ఎర్రిస్వామి, సూరి తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి తరలిరండి



మాట్లాడుతున్న వాల్మీకి నాయకులు

ఎమ్మిగనూరురూరల్: వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణకు ఈ నెల 14న పట్టణంలో నిర్వహించే జిల్లాస్థాయి రౌండ్ టేబుల్ సమావేశానికి పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఐక్య వాల్మీకి సంఘం నాయకులు బజారి, రామకృష్ణ, చిన్న ఈరన్న, సోమేష్, రాఘవన్, మల్లయ్య, కృష్ణమూర్తి, కాశీం, రంగన్న పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక శిల్పా ఎస్టేట్‌లోని జోగులాంబ దేవాలయం అవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లోనూ, కర్ణాటక రాష్ట్రంలో వాల్మీకులు ఎస్టీలుగా కొనసాగుతున్నారన్నారు. వాల్మీకులను ఎస్టీల్లో చేర్చాలని కోరుతూ ఈనెల 14న పట్టణంలోని అజంతా ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశానికి పార్టీలకతీతంగా హాజరుకావాలని పిలుపునిచ్చారు. వాల్మీకి పెద్దలు, మేధావులు యువకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు మధుబాబు, రంగస్వామి, యాపిలయ్య, నరసింహులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాయి ఆలయ వార్షికోత్సవం

ఆలూరు: మండలంలో కమ్మరచేడు గ్రామంలో ఆదోని రోడ్డులో నిర్మించిన శిరిడీ సాయిబాబా ఆలయం ఎనిమిదవ వార్షికోత్సవం ఆదివారం ఆనంద సాయి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ కే.పి శ్రీకంఠమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి క్షీరాభిషేకం, గణపతిపూజ, కలశస్థాపన, సాయిమూల మంత్రోచ్ఛరణ నగవగ్రహ పూజ, ఫల, పుష్ప, గంజ పూజ, పంచామృతాభిషేకం, మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ హరిపుష్పావతమ్మ, సర్పంచ్ సుమతి, నాయకులు మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ రంగమ్మ, ప్రహ్లాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి అమ్మవార్ల దేవర

కృష్ణగిరి: మండల పరిధిలోని ఆలంకొండ గ్రామ దేవతలైన సుంకులమ్మ, పెద్దమ్మ అమ్మవార్ల దేవరను ఈ నెల 14, 15 తేదీల్లో జరుపుకుంటున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. 41ఏళ్ల తర్వాత ఈ దేవర ఉత్సవాలను జరుపుకోనున్నారు. 14న అమ్మవార్లకు ప్రతి ఇంటి నుంచి నైవేద్యంతో ప్రత్యేక పూజలు, 15న అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకోనున్నట్లు వారు తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆలూరు: జిల్లాలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా స్థానిక జ్యోతిబసు భవన్‌లో జిల్లా నాయకులు నారాయణ స్వామి ఆధ్వర్యంలో ఆదివారం నియోజకవర్గంలోని కార్మికులతో ఆయన సమావేశమయ్యారు. జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాకృష్ణ మాట్లాడుతూ పలు రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలను మంజూరు చేయాలన్నారు. గ్రీన్ అంబాసిడర్ (స్వచ్ఛభారత్ కార్మికులు)లకు నెలనెలా జీతాలను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి షాకీర్, కృష్ణ, డీవైఎఫ్ఐ నాయకుడు మైనా తదితరులు పాల్గొన్నారు.

భక్తి పారవశ్యం



మెట్టుమెట్టుకు టెంకాయ కొడుతూ మోకాళ్లపై ఎక్కుతున్న భక్తుడు

హొళగుంద: రాష్ట్రంలో ప్రత్యేకతను సంతరించుకున్న దేవరగట్టులో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని మాళమల్లేశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. ఆలయ పూజారులు స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, పుష్పార్చన, మహామంగళహారతి, ఆకుపూజ, నివేధన, నీరాజన మొదలైన పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. భక్తులు పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా మాత మాళమ్మ, శివాసన కట్టను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. నగరూరుకు చెందిన భక్తులు కొండ పైవరకు ఉన్న 401 మెట్లను మోకాళ్లపై ఎక్కుతూ ప్రతి మెట్టుకు టెంకాయ కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదం పంపిణీతో పాటు స్థానిక ఆస్పరి మఠంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు.

శ్రీశైలానికి తరలిన శివస్వాములు



శివస్వాములను సాగనంపుతున్న దృశ్యం

నందవరం: మండల పరిధిలోని జొహరాపురం, పెద్దకొత్తిలి గ్రామ శివస్వాములు ఆదివారం పాద యాత్రగా శ్రీశైలానికి బయలుదేరి వెళ్లారు. అంతకుముందు గ్రామ శివాలయాల్లో పడి, ఇరుముడి పూజలు గావించి అభిషేకాలు చేపట్టారు. గ్రామస్తులు స్వాములకు పూలమాలలు వేసి, నారికేళాలు సమర్పించి, దారి పొడవునా జలాభిషేకాలతో వీడ్కోలు పలికారు. జొహరాపురంలో పురోహితుడు హంపేష్ స్వామి ఆధ్వర్యంలో శివుడికి జలాభిషేకం, బిల్వార్చన, ఆకు పూజ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం వంటి విశిష్ట పూజలు గావించారు. అనంతరం ఇరుముడి పూజలు చేపట్టారు. దాదాపు 46 మంది శివస్వాములు పాదయాత్ర చేపట్టగా గ్రామస్తులు డోలు వాయిద్యాల నడుమ నందికోలు సేవతో సాగనంపారు. చిన్నారులు, మహిళలు కలశాలతో వీడ్కోలు పలికారు. జొహరాపురంలో గ్రామస్తులు అన్నదానం చేపట్టారు. గ్రామపెద్దలు ఎంపీటీసీ విజయ్‌మోహన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం తగదు

ఆలూరు: పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు స్థలాలను చదును చేస్తే అది భూ కబ్జా ఎలా అవుతుందని ఆలూరు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ వీరేష్ పచ్చ మీడియాను ప్రశ్నించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఆలూరులో అర్హత గల నిరుపేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసేందుకు చెరువు సమీపంలో ఉన్న పొరంబోకు భూమిని చదును చేస్తే దానిపై ఎల్లో మీడియా భూకబ్జా అని ప్రచురించడాన్ని తప్పుబట్టారు. నిజనిజాలు తెలుసుకోకుండా తప్పుడు ప్రచారం చేస్తూ సంక్షేమ పథకాలను అడ్డుకోవాలని చూస్తే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. నాయకులు బొగ్గుల ఈరన్న, వరుణ్, హనుమయ్య, దీపక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

ఆలూరు: హత్తిబెళగళ్‌కు చెందిన రైతు గంటి కురుబ ఈరన్న (42) ఈ నెల 9న పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకోవడంతో ఆదివారం ఆ కుటుంబాన్ని జనసేన నాయకులు పరామర్శించారు. ఈరన్న భార్య ఎల్లమ్మ, డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న కుమారుడు రాజ్‌ను పరామర్శించి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆ పార్టీ నాయకులు తెర్నేకల్ వెంకప్ప రంజిత్, చత్రపతి, తదితరులు ఉన్నారు.

మార్కెట్ యార్డు కళకళ



మార్కెట్‌కు వచ్చిన వేరుశనగ దిగుబడులు

ఎమ్మిగనూరు: అన్నదాతను ఈయేడు ప్రకృతి వైపరీత్యాలు వెంటాడినప్పటికీ దిగుబడులకు ఆశాజనకంగా ధరలు లభిస్తుండటం ఊరటనిస్తోంది. మార్కెట్లో రేట్లు మద్దతు ధర కంటే దిగువకు ఉంటే ప్రభుత్వమే ఆర్బీకేల ద్వారా వరి, మొక్కజొన్నను కొనుగోలు చేసి నెల రోజుల వ్యవధిలో సొమ్ము చెల్లిస్తోంది. దిగుబడులకు గిట్టుబాటుకు మించిన ధరలు లభిస్తుండటంతో రైతులు మార్కెట్ విక్రయాల వైపు మొగ్గుచూపుతున్నారు. ఆదివారం ఎమ్మిగనూరు మార్కెట్ యార్డు పంట ఉత్పత్తులతో కళకళలాడింది. ఒక్కరోజే 356 మంది రైతులు 2,454 క్వింటాళ్ల వివిధ రకాల దిగుబడులను తెచ్చారు. అందులో వేరుశనగ 2,329 క్వింటాళ్లు ఉండటం విశేషం. వేరుశనగ గరిష్ట ధర క్వింటాల్‌కు రూ.8,290 పలకగా, కందులు రూ.7009, ఆముదాలు రూ.6504, మొక్కజొన్న రూ.1982, శనగలు రూ.4500లకు అమ్ముడుపోయినట్లు యార్డు కార్యదర్శి ఉమాపతి రెడ్డి తెలిపారు.

ఓటరు జాబితా విడుదల

చిప్పగిరి: ఎమ్మెల్సీ ఎన్నికలో భాగంగా ఎంపీటీసీల (స్థానిక సంస్థల కోటా) ఓటరు జాబితాను విడుదల చేసినట్లు ఎంపీడీఓ సుధాకర్ రాజు ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీల ఓటరు జాబితాను మండల పరిషత్ కార్యాలయంలో అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఏమైనా సందేహాలుంటే ఫారం-17లో వివరాలు పొందుపరచి మండల కార్యాలయానికి, లేదా ఎన్నికల రిటర్నింగ్ అధికారి లేదా జాయింట్ కలెక్టర్‌కు అందజేయాలని సూచించారు. సందేహాలుంటే స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

పత్తికొండ రూరల్: పత్తికొండ-కర్నూలు రోడ్డులోని నల్లగుట్ట కొండలో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం ఎర్రజెండాలు నాటారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, మండల కార్యదర్శి రాజాసాహెబ్ మాట్లాడుతూ.. ఆ ప్రాంతాన్ని ఇంటి స్థలాలు లేని నిరుపేదలకు కేటాయించాలని కోరారు. లేదంటే పేదల పక్షాన పోరాటాలు కొనసాగిస్తామన్నారు. నాయకులు రామాంజనేయులు, కృష్ణయ్య, రంగన్న, కారన్న, మాదన్న పాల్గొన్నారు.